రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

విశాలాంధ్ర - పెందుర్తి: ఆనందపురం - అనకాపల్లి జాతీయ రహదారిలో పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెం వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం, తిరుగుడు మెట్ట గ్రామానికి చెందిన బంధువులు విశాఖలో శుభకార్యానికి వచ్చి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన చింతాడ ఇందు, హనుమంతు ఆనంద్, హనుమంతు చంద్రశేఖర్ మృత్యువాత పడ్డారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

పింఛన్ల కోసం తప్పని పాట్లు..

సచివాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షణ మండుటెండల్లో వృద్ధులు విలవిల

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మండుటెండల్లో వృద్ధులు విలవిలలాడుతూ పింఛన్ల కోసం సచివాలయాల వద్ద గంటలు తరబడి నిరీక్షిస్తున్నారు. ఎక్కడ చూసినా, ఎవరి నోట విన్నా పెన్షన్ల పంపిణీ అంశమే వినిపిస్తోంది. పెన్షన్లపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటలు కూడా తారాస్థాయికి చేరుకుంటున్నాయి. మండుటెండలో పింఛన్ దారులకు పాట్లు తప్పడం లేదు. పెన్షన్ల కోసం ఎదురు చూసిన పెన్షన్‌దారులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిన్నటి నుంచి పెన్షన్ల పంపిణీ ప్రారంభం అయిన ప్పటికీ రెండో రోజు గురువారం కూడా మండుటెండల్లో సచివాలయాలకు వచ్చి క్యూ కట్టిన పండుటాకులకు పడిగాపులు తప్పలేదు. పెన్షన్ల కోసం ఉదయం నుంచి వృద్ధులు, వితంతువులు సచివాలయాల వద్ద క్యూలైన్లలో పడిగాపులు పడాల్సి వచ్చింది. అయితే డబ్బులు అందలేదని, ఉదయం నుంచి కాదు మధ్యాహ్నం నుంచి పెన్షన్ పంపిణీ అంటూ ఇలా పలు రకాల ప్రకటనలతో పెన్షన్‌దారులు ఇబ్బందులు పడ్డారు.

అనారోగ్యంతో ఉన్నవారు, వికలాంగులకు ఇళ్ల వద్దే పెన్షన్ ఇవ్వాలన్న ఎన్నికల సంఘం, సీఎస్ ఆదేశాలు ఎక్కడా అమలు కాని పరిస్థితి ఏర్పడింది. ఉదయం పది గంటలకే నగదు అయిపోయిందని సిబ్బంది చెప్పడంతో మళ్లీ బ్యాంకుల్లో తేవాలని చెబుతూ సచివాలయ సిబ్బంది వృద్ధులను వెనక్కి పంపుతున్నారు.

నడవలేని వారి ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని ఆదేశించినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. చివరకు సహాయకుల ద్వారా కష్టపడి వస్తే పెన్షన్ ఇవ్వకుండా వెనక్కి పంపుతున్నా రంటూ పెన్షన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ రాజకీయాలకు తమను బలి చేయవద్దని వృద్ధులు విజ్ఞప్తి చేస్తున్నారు. విశాఖ జిల్లాలో 1,65,432 లబ్ధిదారులు ఉండగా వీరిలో తొలిరోజు 48 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

నారాయణమ్మకు సీపీఐ నివాళి

విశాలాంధ్ర - గాజువాక: సీపీఐ నాయకులు మేడిశెట్టి గెడ్డయ్య మాతృమూర్తి మేడిశెట్టి నారాయణమ్మకు సీపీఐ నేతలు నివాళులు అర్పించారు. గురువారం గాజువాక లోని గెడ్డయ్య నివాసం వద్ద జరిగిన నారాయణమ్మ శ్రద్ధాంజలి కార్యక్రమా నికి సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, విశాఖ పట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్ర రావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, గాజువాక నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఇటీవల మృతి చెందిన మేడిశెట్టి నారాయణమ్మ అందరితో సన్నిహితంగా మెలిగే వారని, నారాయణమ్మ మృతి ఆ కుటుం బానికి తీరని లోటని అన్నారు. ఇంకా ఈ కార్య క్రమంలో సీపీఐ నాయకులు టి.సాంబమూర్తి, జి.ఆనంద్, కె.అచ్యుత రావు, అప్పారి విష్ణు మూర్తి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు కె.వనజాక్షి, నారాయణమ్మ కుమారులు గేడ్డయ్య, కృష్ణ పాల్గొన్నారు.

మెటీరియల్ వేసారు సరే.... మరి పనులెక్కడ....

రోడ్డును గాలికి వదిలేసిన అధికారులు, నాయకులు

విశాలాంధ్ర - ఆనందపురం: నిత్యం రద్దీగా ఉండే రోడ్లలో బంటుపల్లి కల్లాలు రహదారి ఒకటి. తరచూ వందల సంఖ్యలో రైతులు, వాహన చోదకులతో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి పగలు మార్కెట్‌కు వారు పండించిన పంటను క్రయ విక్రయాలు చేస్తారు. అందరికీ ఉపయోగకరంగా ఉన్న రోడ్డులో సుమారు 800 మీటర్ల రోడ్డును అధికారులు గాలికి వదిలేసారు. ఈ మధ్యకాలంలో పనులు ప్రారంభం చేస్తామని అధికారులు, నాయకులు సమక్షంలో కొబ్బరికాయ కొట్టి హడావిడి చేశారు. ఇప్పటివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు పనులు మాత్రం మొదలు పెట్టలేదు. సదర విషయంపై మండల ఇంజ నీరింగ్ అధికారులను ప్రస్తావించగా ఎలక్షన్ కోడ్ ఉన్నందున అలాగే కాంట్రాక్టర్‌లు ఎవరూ కూడా ముం దుకు రాలేదని విడ్డూరంగా చెప్పారు. కానీ నిత్యం ఈ అధ్వాన్న రోడ్డులో అనేకసార్లు ప్రమాదాలకు గురి అవుతున్న ప్పటికీ కూడా అటు నాయకుల్లో గాని ఇటు అధికారుల్లో గానీ ఎటువంటి చలనం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో అధికార పార్టీ నాయకులు ఎవరైనా ఓట్లు అడగడానికి వస్తే వాళ్లకు సరైన గుణపాఠం చెప్తామని పంచాయతీ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కారమయ్యేనా....

విశాలాంధ్ర-సింహాచలం: ప్రజలు రాజకీయ నాయకుల వల్ల పదేపదే మోసపోతున్నారు. దశాబ్దాలు గడిచినా పంచగ్రామాల భూ సమస్య పరిష్కారం కావటం లేదు. ఏ ప్రభుత్వం వచ్చినా ఇదిగో, అదిగో అంటూ మాట దాట వేస్తూ ఎన్నికల సమయం వచ్చే సరికి అది చేశాం ఇది చేశాం అంటూ రైతుల్ని, ప్రజల్ని మభ్య పెట్టి ఓట్లు వేయించుకుని వారి వారి పనులు చేసుకుంటున్నారు. కంటి తుడుపు చర్యగా కాలువలు, రోడ్లు, బోర్లు, వేయటం పనులు చేస్తున్నారని పంచ గ్రామాల ప్రజలు, రైతులు వాపోతున్నారు. మరి కొంతమంది అయితే అసలు ఓటు వేయకుండా బాయ్ కట్ చేస్తే బాగుంటుందని అంటున్నారు. అది జరిగే పని కాదని కొంతమంది రాజకీయ నాయకులు అంటున్నారు. అన్ని పార్టీలు ఆయా పార్టీల్లో పనిచేస్తున్న నాయకులు ఒకే జాతికి చెందిన వారని ప్రజలు తెలుసుకోలేకపోతున్నారు. ఒక పార్టీలో కాకపోతే మరొక పార్టీలో నైనా మంచి వారు నిజాయితీపరులు ఉండకపోతారా అని అనుకుంటారు. అలా అనుకునే ఎన్నికలు వచ్చినప్పుడల్లా అధికార మార్పిడి చేస్తుంటారు. తమను నిర్లక్ష్యం చేసిన వారిని తిరస్కరిస్తూ, వేరే పార్టీకి లేదా పార్టీల కూటములకు ఓటు వేస్తుంటారు. అధికారంలోకి తెస్తుంటారు. కాని అన్ని పార్టీల విధానాలు, పనిచేసే తీరు ఒకలానే ఉంటా యని, అధికారంలోకి వచ్చాక కాని తెలుసుకోలేకపోతున్నారు. ప్రజాభిమానంతో అధికారంలోకి అహంకారాన్ని ఆ ప్రజల మీదనే ప్రదర్శిస్తుంటారు. ప్రజలను వంచిస్తున్నారని పంచ గ్రామాల భూ బాధితులు వాపోతున్నారు.

16న ఫిట్జీ ఆధ్వర్యంలో ఎర్లీ లీడ్ ఎగ్జామ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: జేఈఈ 2025 పరీక్షకులకు ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం తాము ఎర్లీ లీడ్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్నట్లు ఫిట్జీ ప్రతినిధి ఆర్.ఎల్ త్రిఖా అన్నారు. గురువారం ఫిట్జీ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేఈఈ 2024లో ఐఐటీలో చదవాలనే లక్ష్యాన్ని కోల్పోయిన అభ్యర్థుల కోసం జేఈఈ 2025 లో ఖచ్చితంగా మెరుగైన ప్రదర్శన కనబరిచేలా "ఎర్లీ లీడ్ ఎగ్జామ్"ను నిర్వహిస్తున్నామన్నారు. ఐఐటీ, టాప్ ఎన్ఐటీ ఇతర ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్‌లలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు జేఈఈ 2025 కోసం ఎర్లీ లీడ్ ఎగ్జామ్ చాలా కీలకమన్నారు. ఎర్లీ లీడ్ పరీక్ష, విద్యార్థులకు వారి కాన్సెప్ట్ వారీగా పనితీరు, ప్రిపరేషన్‌లో ఉన్న అంతరాన్ని విశ్లేషిస్తుందన్నారు.

జేఈఈ 2025 ఆశా వాదులకు, ఎర్లీ లీడ్ పరీక్ష జేఈఈ 2024లో వారి తప్పులను సరిదిద్దడానికి అవకాశాన్ని అందిస్తుం దన్నారు. దేశవ్యాప్తంగా ఎర్లీ లీడ్ పరీక్ష భారతదేశం అంతటా ఏప్రిల్ 16న నిర్వహించబడుతుందన్నారు. పరీక్ష కోసం నమోదు చేసుకోవడానికి ఏప్రిల్ 14 వ తేదీ గడువు అన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ https://admissiontest.fiitjee.com/earlylead/ లేదా ఆఫ్‌లైన్‌లో ఏదైనా ఫిట్జీ కేంద్రాన్ని సందర్శించవచ్చని, మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ https://www.fiitjee.comలో సంప్రదించాల్సిందిగా కోరారు.

కూటమి అభ్యర్థుల గెలుపే అందరి లక్ష్యం

విశాలాంధ్ర - పెందుర్తి: వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే అందరి లక్ష్యం అని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. గురువారం ఉదయం టీడీపీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు నివాసంలో ఆయా పార్టీల ముఖ్య నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు, జీవీఎంసీ 97వ కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు, 94వ వార్డ్ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పైల జగన్నాథం, బైలపూడి హరగోపాల్ రెడ్డి, నారాయణరావు, గండి దేవుడు బాబు, గళ్ళ శ్రీనివాసరావు, పార్టీల పీలా జితేంద్ర పాల్గొన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతం చేయడమే అందరి లక్ష్యం కావాలని పేర్కొన్నారు.

విశాఖలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఇక లేనట్లే

విశాలాంధ్ర - విశాఖ క్రైం: ఎస్సీ ఎస్టీ కేసుల సమీక్షను త్వరితగతిన పరిష్కరించడానికి నేరాలకు పాల్పడిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ కేసుల నుంచి తప్పించుకోకుండా వారికి చట్టం పరిధిలో శిక్ష పడేలా చూడటానికి, అట్రాసిటీ కేసులకు సంబంధించి ఘటనలు జరిగినప్పుడు బాధితులు సరైన పద్ధతిలో సమగ్ర అంశాలతో ఫిర్యాదు చేసేందుకు, అలాగే శాంతిభద్రతల పరిరక్షణతో పాటు బందోబస్తు ఒత్తిడితో ఉన్న స్థానిక పోలీసులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం కొన్నాళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీ సెల్ పేరిట ప్రత్యేక విభాగాల్ని ప్రారంభించింది. అయితే సిబ్బంది కొరత, మౌలిక వసతుల సదుపాయాల ఇబ్బందుల్ని సాకుగా చూపిస్తూ విశాఖలో ఉన్న ఎస్సీ, ఎస్టీ సెల్ లను అధికారులు మూసేశారు. ఇకపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు సంబంధిత పోలీస్ స్టేషన్లలోనే కొనసాగనుంది. కేసుల నమోదు స్టేషన్లలోనే కొనసాగినా దర్యాప్తులో వేగం పెంచేందుకు సంబంధిత కేసుల్ని ఏసీపీ స్థాయి అధికారులతో ఉన్న సెల్‌కు అప్పగించేవారు. అందుకోసం సీఐలుగా పని చేసిన వారికి సూపర్ న్యూమర్ పదోన్నతుల పేరిట ప్రమోషన్ ఇచ్చి ఆ తర్వాత వారికి పోస్టింగ్లు కూడా ఇచ్చారు. ఇదిలా ఉంటే ఏసీపీ స్థాయి అధికారులు వివిధ ముఖ్య కేసులతో పాటు సెక్యూరిటీ అనుమతులు, సభలు, సదస్సులతో అనుమతులతో బిజీ అయిపోతున్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ కేసుల పర్యవేక్షణ వీరికి కూడా భారంగానే ఉందనే అభిప్రాయంతో గతంలో మాదిరి మళ్లీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు స్థానిక పోలీస్ స్టేషన్లకే అప్పజెబుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే ఈ నిర్ణయం తీసుకుని ఎస్సీ, ఎస్టీ కేసుల పర్యవేక్షణాధికారులైన ఏసీపీ/డీఎస్పీలకు వివిధ బాధ్యతల ప్పగించింది. దీంతో విశాఖలో ఉన్న ఎస్సీ, ఎస్టీ సెల్ 1, 2లను అధికారులు మూసేశారు.

రక్షణ రంగంలో యువ శాస్త్రవేత్తల పాత్ర కీలకం

విశాలాంధ్ర - గోపాలపట్నం: డీఆర్‌డీఓ యువ శాస్త్రవేత్తల సమావేశం ఎన్ఎస్‌టీఎల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ రక్షణ శాఖ ఆర్ అండ్ డి కార్యదర్శి డాక్టర్ సమీర్ కామత్ హాజరై ప్రారంభించారు. డిఫెన్స్ సైన్స్ టెక్నాలజీకి సంబంధించిన సమకాలీన, భవిష్యత్తు అంశాలను నెట్‌వర్క్ చేయడానికి, పరస్పరం పంచుకోవడానికి, చర్చించడానికి గాను ఈ మీట్ నిర్వహించారు. మూడు రోజుల సమావేశంలో ఆహ్వానించబడిన చర్చలు, సమూహ నిర్మాణ కార్యకలాపాలు, ఆవిష్కరణ పోటీలు, సాంకేతిక సౌకర్యాల సందర్శనలు ప్రణాళిక చేయబడ్డాయి. సదస్సు కన్వీనర్ శ్రీనివాసరావు ప్లాన్ చేసిన వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ వికాసిత్ భారత్ యొక్క గొప్ప లక్ష్యాల కోసం అవకాశాన్ని ఉపయోగించు కోవాలని, ఆవిష్కరణలు చేయాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జయ శాంతి, డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై శ్రీనివాసరావు, ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీతో గెలిపించండి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ ఎన్నికల ప్రచారంలో భాగంగా 91వ వార్డు లక్ష్మీ నగర్‌లో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణ కుమారి ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ప్రజలతో కొంతసేపు ముచ్చటించి రానున్న ఎన్నికల్లో మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అలాగే విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గేదెల మురళీకృష్ణ, రాష్ట్ర పార్లమెంట్ సిటీ నాయకులు సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎస్ఈబి పోలీసుల సోదాలు

విశాలాంధ్ర - విశాఖ క్రైం : అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టడంలో భాగం గా సెబ్ పోలీసులు నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను ఆపేందుకు డాగ్ స్క్వాడ్‌లతో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసులతో కలిసి సెబ్ అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు తనిఖీలు నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం ముమ్మర దాడులు నిర్వహిస్తున్నామన్నారు. గత నెలలో మహారాణిపేట సేబ్ స్టేషను పరిధిలో 37 బెల్ట్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఎవరైనా సమాచారం ఇస్తే తక్షణం స్పందిస్తామని సుబ్బారావు తెలిపారు. తనిఖీల్లో మహారాణిపేట సీఐ మధు కుమార్, రాజుల నాయుడు, ఎస్ఐలు మోహన్, వేణు పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రచారాలు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని ఏడు వార్డుల్లో టిడిపి, వైసిపి అభ్యర్థుల గెలుపు కోసం స్థానిక నాయకులు పోటాపోటీ ప్రచారాలు చేస్తున్నారు. టిడిపి కూటమి అభ్యర్థి గణబాబుని కల్పించాలంటూ టిడిపి శ్రేణులు స్థానిక శ్రీహరిపురం ప్రాంతంలో ప్రచారం నిర్వహించగా, వైసిపి అభ్యర్థి తరపున 59వ వార్డులో విస్తృత ప్రచారాన్ని చేపట్టారు.

ఎన్నికల విధులకు అధికారులు తప్పక హాజరుకావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎన్నికల విధులకు, సంబంధిత శిక్షణ సదస్సులకు అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎ.మల్లిఖార్జున ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఎన్.ఐ.సి. అధికారులతో కలిసి కలెక్టరేట్ వీసీ హాలు నుంచి గురువారం ఉదయం డిజిటల్ ప్రక్రియలో పీవో, ఏపీవో, ఓపీవోలకు ఆయన ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ క్రమంలో అక్కడ అధికారులకు జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఆయా నియోజకవర్గాలకు అధికారులను, సిబ్బందిని కేటాయించాలని సూచించారు. సంబంధిత ఆర్డర్ కాపీలను, పోస్టల్ బ్యాలెట్ వినియోగం నిమిత్తం ఫారం-12 పత్రాలను అందజేయాలని చెప్పారు. ఈ నెల 10, 12వ తేదీల్లో జరిగే శిక్షణ సదస్సులకు అందరూ విధిగా హాజరు కావాల్సిందేనని ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున హెచ్చరిం చారు. ఎన్నికల కమిషన్ పేర్కొన్న నిబం ధనలను పాటిస్తూ సిబ్బందిని కేటాయించారు. వీరంతా ఈ నెల 10, 12వ తేదీల్లో జరిగే శిక్షణ సదస్సులకు వారికి కేటా యించిన ప్రాంతాల్లో హాజరుకావాల్సి ఉంటుంది. ఈ మేరకు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలకు సమగ్ర ఏర్పాట్లు చేసింది.

విశాఖ ఉక్కు పరిరక్షణ జీవితాశయం: పల్లా

విశాలాంధ్ర - గాజువాక: "విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించడమే నా జీవితాశయం. 7 రోజులు పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్య మానికి తన వంతు ఊపిరి పోసానని శాసనసభ్యుడిగా నన్ను, పార్లమెంట్ సభ్యుడిగా భరత్‌ను గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటానని" ఎన్‌డీఏ ఉమ్మడి గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం గాజువాక లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, నిర్వాసితులు చేస్తున్న ధర్మమైన పోరాటానికి సంపూర్ణ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అదానికి అమ్మి పెట్టడమే జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఉన్న వైసిపి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వైసీపీ నాయకులు ప్యాకేజీల కోసమే గంగవరం పోర్టు ప్రభుత్వ వాటాని కారు చౌకగా అదానికి అమ్మడం, వైకాపా నాయకులు నోట్లు కట్టలిచ్చి ప్రజలను కొనాలని చూస్తున్నారని, ఐతే అమ్ముడు పోయే అంత అమాయకులు కాదు గాజువాక నియోజకవర్గ ప్రజలన్నారు. అది గ్రహించాలని కోరారు. కల్తీ మద్యాన్ని, సినిమా టిక్కెట్లు ప్రభుత్వ ఉద్యోగులతో అమ్మించిన జగన్మోహన్ రెడ్డి, పింఛన్లు వారి చేత ఇంటింటికి పంపిణీ చేయకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. తన బినామీ కాంట్రాక్టర్లకు ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రాష్ట్ర సంపద అయినటువంటి 13వేల కోట్ల రూపాయలను ధారాదత్తం చేసి, పండు ముదుసలి, వితంతువులు, వికలాంగులు రోడ్డుపాలు చేసిన పాపం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన, అంతిమ విజయం మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఉన్న కూటమి పార్టీలదే అని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజవర్గం జనసేన ఇంచార్జ్ కోన తాతారావు, జనసేన రాష్ట్ర పార్టీ కార్యదర్శి గడసాల అప్పారావు, జీవీఎంసీ కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, మొల్లి ముత్యాల నాయుడు, జనసేన రాష్ట్ర నాయకులు గంధం వెంకటరావు, నియోజవర్గ సమయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెన్నెలఈశ్వర రావు, నల్లూరి సూర్యనారా యణ, గోమాడ వాసు, ఎస్.రతన్కాంతు సింగూర్ ఆనంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాలలో ఏయూకు పతకాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన 37వ నేషనల్ యూత్ ఫెస్టివల్లో ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థులు రెండు విభాగాలలో పతకాలను సాధించారు. పంజాబ్ రాష్ట్రం లూథియానా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ యువజనోత్సవాలలో ఏయూ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. విభాగ విద్యార్థి కె. నాగ మణికంఠ క్లే మోడలింగ్లో మూడవ స్థానాన్ని సాధించాడు. అదే విధంగా ఇనస్టలేషన్ పోటీలో ఏయూ విద్యార్థులు జె.రంగ బాబు, యు.ఎం.ఎస్ నవ్య, బి.ఝాన్సీ, కె.రేణు కల బృందం రెండవ స్థానాన్ని సాధించారు. ఈ సంద ర్భంగా వీరిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినం దించారు. జాతీయ స్థాయిలో ఏయూ ప్రతిభను ఇనుమడింపజేసిన విభాగ విద్యార్థులను అభినం దించారు. గతంలో వీరు ఏయూలో నిర్వహించిన సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్లో పాల్గొని విజేతలుగా నిలచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సుదీర్ఘ కాలం తరువాత ఏయూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ మోహన్ విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు గుర్తింపు కార్డులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అల్లిపురం భీంనగర్ షెల్టర్‌లో ఎలాంటి గుర్తింపు కార్డులు లేని నిరాశ్రయులకు జిల్లా న్యాయ సేవాసదన్ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ చేతుల మీదుగా 42 మందికి ఓటర్ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఓటు హక్కు స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలని, ఏ ఒక్క పార్టీ, వ్యక్తులు, షెల్టర్ నిర్వాహకులు కాని ఒత్తిడి పెట్టిన, పలుకుబడికి ఓటు హక్కు దుర్వినియోగం చేయవద్దని, అలాంటివి జరిగినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా డిఎల్ఎస్ఏ సహకారంతో అన్ని రకాల హక్కులు కల్పించగలుగుతున్నామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు గుర్తు చేస్తూ అందిస్తున్న సహకారానికి ధన్య వాదాలు తెలిపారు. యూసీడీ డీపీఓ ఫనిరాం జీవీఎంసీ అందిస్తున్న వాటా నిధుల వివరాలను వెల్లడించారు.

భీమిలిలో దారుణం

వ్యక్తికి నిప్పంటించిన ఆకతాయిలు
చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
ఆలస్యంగా వెలుగులోకి....

విశాలాంధ్ర - భీమిలి: భీమిలిలో వరుస సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. భీమిలిలోని చిన్న ఉప్పాడ గ్రామంలో దారుణం చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలానికి చెందిన చెప్పాల నాగభూషణ్ భార్య పిల్లలతో భీమిలి మండలం చిన్నప్పాడలో నివాసం ఉంటున్నాడు. స్థానికుల కథనం మేరకు చెప్పాల నాగభూషణ్ అలియాస్ జాన్(35) చిన్న ఉప్పాడలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. జాన్ సమీ పంలోని కలింగలో సూపర్వైజర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన పవన్, మనోజ్, రాజు (19) అనే యువకులు అతని ఇంటి ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రతిరోజు సిగరెట్, మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఉండేవారు. భార్య భర్తలు ఇద్దరూ ఏకాంతంగా ఉన్న సమయాల్లో వీరు ముగ్గురు కిటికీలో నుంచి చూసి అతని భార్యను తరచూ వేధిస్తూ ఉండేవారు. ఒకరోజు రాత్రి భార్య భర్తలు ఇద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో వీళ్ళు కిటికీ నుంచి చూస్తుండగా గమనించిన నాగభూషణ్ వారిని పిలిచి మందలించాడు. అయితే దీనిని మనసులో పెట్టుకుని ముగ్గురు యువకులు గత నెల 29న రాత్రి ఇంట్లో ఉన్న నాగభూషణంని పిలిచి వెంట తెచ్చుకున్న కెమికల్‌ను అతని ఒంటిపై పోసి నిప్పంటించి అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో నాగభూషణ్ పెద్దగా కేకలు వేయడంతో భార్య చుట్టుపక్కలున్న వారిని పిలవడంతో, వెంటనే వారు వచ్చి మంటలను ఆర్పి తీవ్ర గాయాల పాలైన అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ నాగభూషణ్ బుధవారం మృతి చెందారు. నిప్పంటించిన ముగ్గురులో ఇద్దరు బాలురు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సంఘటన జరిగి ఐదు రోజులు కావస్తున్న విషయాన్ని బయటికి రానివ్వకుండా స్థానిక పెద్దలు పోలీసులను మేనేజ్ చేసినట్టు తెలిసింది. పైగా పెద్దలు కేసు లేకుండా సెటిల్మెంట్ చేయడానికి ప్రయత్నించినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయాన్ని పోలీసులు మీడియాకి తెలియజేయకపోవడం గమనార్హం. చికిత్స పొందుతూ నాగభూషణం చనిపోవడంతో ఎట్టకేలకు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ప్రస్తుతం ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టిస్తుంది. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళామందిర్‌లో 'రసమయి' సిల్వర్ జ్యువెలరీ స్టోర్

విశాలాంధ్ర -విశాఖ సిటీ: ప్రముఖ ఎత్నిక్ అపెరల్ రిటైలర్ సాయి సిల్క్ కళామందిర్ లిమిటెడ్ (ఎస్ ఎస్ కే ఎల్) సిల్వర్ ఆభరణాల షోరూము ఏర్పాటు చేసింది. విశాఖలోని కళామందిర్ స్టోర్‌లో "రసమయి" బ్రాండ్ తో తమ మొదటి ఫైన్ సిల్వర్ జ్యువెలరీ రిటైల్ అవుట్లెట్‌ను ప్రముఖ యాంకర్, టీవీ నటి శ్రీ ముఖి ముఖ్యఅతిథిగా హాజరై స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ వాసులకు అందుబాటులో రసమయి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ వాసులంతా రసమయి లో లభించే ఆభరణాలను ఆదరించాలన్నారు.

విశాఖలో ఈ తరహా ప్రత్యేక ఆభరణాల షో రూమ్‌గా రసమయి తీసుకురావడం నగర వాసులకు ఎంతో ఉపయోగమన్నారు. విభిన్న తరహా అభరణాలు, ఫ్యాషన్ పరిశ్రమలో దశాబ్దాల తరబడి ఉన్న తమ మహోన్నత వారసత్వం పై ఆధారపడి ఫైన్ సిల్వర్ జ్యువెలరీలో విభాగంలోకి ప్రవేశించాలనే నిర్ణయం తీసుకున్నట్టు కళామందిర్ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ చెప్పారు. ఈ పోర్ట్ఫోలియోలో టెంపుల్ జ్యువెలరీ, యాంటిక్ నక్షి ఆభరణాలు, సీ జెడ్ జ్యువెలరీ, విక్టోరియన్ జ్యువెలరీ, కుందన్ జ్యువెలరీ, మొయిసానైట్ జ్యువెలరీ మరియు అల్ట్రా ప్రీమియం లైట్ వెయిట్ జ్యువెలరీ ఉన్నాయన్నారు. కళామందిర్‌లో అల్ట్రా ప్రీమియం ప్రీమియం చీరలు, లేహంగాలు, పురుషులు పిల్లల ఎత్నిక్ వస్త్రాలతో సహా అనేక రకాల ఉత్పత్తులను అందిస్తుందని చెప్పారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నామినేషన్ల ప్రక్రియ, బ్యాలెట్ వినియోగంపై అధికారులు, సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని తూర్పు నియోజకవర్గ ఆర్.వో., జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం తన ఛాంబర్లో తూర్పు నియోజకవర్గ అధికారులతో సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచి ముగిసే వరకు సంబంధిత క్రతువుకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, అభ్యర్థులకు, కింది స్థాయి అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని చెప్పారు. సంబంధిత సామగ్రి, సాంకేతిక పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులకు చెప్పారు. సమావేశంలో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో డీసీపీ-1 మణికంఠకు బదిలీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసిపి 1 గా ఉన్న మణికంఠను చిత్తూరు జిల్లా ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఇటీవల ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా ఎస్పీని తప్పించిన ఎన్నికల కమిషన్ అధికారులు ఆస్థానంలో డీసీపీ మణికంఠకు ఎస్పీగా పదోన్నతి కల్పించి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో ముగ్గురు ఐఏఎస్ లకు, 5 మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఇవ్వడంలో భాగంగా మణికంత బదిలీ జరిగింది అయితే డిసిపి గా ఎవరిని నియమించలేదు.

ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరుగుతుంది

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎన్నికల నిర్వహణ ప్రక్రియ నిష్పక్ష పాతంగా జరుగుతుందని, ప్రవర్తనా నియమావళి అమల్లో అప్ర మత్తంగా ఉంటున్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎ. మల్లిఖార్జున పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన ఘటనల్లో పలువురిపై చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం సమావేశం నిర్వహించారు. ఓటు నమోదు ప్రక్రియ, కోడ్ అమలు, ర్యాండమైజేషన్, కేసుల నమోదు తదితర అంశాలపై చర్చించారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారు ఎవరైనా ఎంతటి వారైనా చర్యలు తీసుకోవటంలో ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 37 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని వారిలో 30 వాలంటీర్లు, ఇద్దరు ఔట్ సోర్సింగ్, ఐదుగురు ఒప్పంద ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. అలాగే కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులపై కూడా చర్యలు తీసుకున్నామని, కేసులు నమోదు చేశామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ తూర్పు ప్రచారంలో మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ తూర్పు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణ బాబును మరోసారి గెలిపించాలని కోరుతూ గురువారం తూర్పు నియోజకవర్గం లో విస్తృత ప్రచారం నిర్వహించారు. 20వ వార్డు ఈస్ట్ పాయింట్ కాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం మాజీ మంత్రి చింత కాయల అయ్యన్న పాత్రుడు , టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభి రామ్ పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో బైరెడ్డి పోతన్న రెడ్డి, నరేంద్ర, ఈశ్వర్, శివ, గోపి, మాలి బాబు, సీతన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌ను
మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం
- తూర్పులో జోరుగా ఎంవీవీ ప్రచారం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సంక్షేమ ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరలా సీఎం చేద్దామని పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం విశాఖ స్థానిక జీవీఎంసీ 17వ వార్డు ఎంపీపీ కాలనీ సెక్టార్-05లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత వైయస్ జగన్మోహన్ రెడ్డి అండగా నిలిచి రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఏపీ సీఎం జగనన్నకు మద్దతు తెలపాలని అదేవిధంగా తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకి మద్దతు తెలపాలని కోరారు.

ముడసర్లోవ వాకర్స్‌తో ముచ్చట..

ఆరోగ్య సమస్యలు దూరం చేసుకోవాలంటే ప్రతి ఒక్కరు రోజు కనీసం 20 నిమిషాలు వ్యాయామంతో పాటుగా నడకతోనే ఎన్నో ఆరోగ్య సమస్యలు దూరం చేసుకోవచ్చని ఎంవివి సత్యనారాయణ అన్నారు.

జీవీఎంసీ 13వ వార్డ్ ముధసర్లోవ వాకర్స్ పార్కులలో వాకర్స్ ను సీని యర్ సిటిజెన్సును గురువారం ఉదయము ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వారితో మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఇప్పటికే విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఆరిలోవ హనుమంతవాక, శివాజీ పాలెం, అప్పుఘర్, బీచ్ రోడ్డు కూడా పార్కు తదితర ప్రాంతాల్లో వాకర్స్‌కు మార్నింగ్ వర్క్ చేసుకునే విధంగా వాకింగ్ ట్రాక్లు, వ్యాయామ పరికరాలు ఇదివరకే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

విధ్వంసంతో ప్రారంభమైన
జగన్ పాలనకు కాలం చెల్లింది
భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విధ్వంసంతో ప్రారంభమైన సీఎం జగన్ పాలనకు కాలం చెల్లిపోయిందని, రాష్ట్రాన్ని విధ్వంసం చేసి, అభివృద్ధి లేక రాష్ట్రం విలవిలలాడుతుందని మళ్లీ చంద్రబాబు తోనే రాష్ట్రం పునర్నిర్మాణం సాధ్యమని మాజీ మంత్రి భీమిలి టిడిపి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు, గురువారం మధ్యాహ్నం ఆయన ఇంటి వద్ద పలువురు సర్పంచులు టిడిపిలో చేరిక అనంతరం గంటా మీడియాతో మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో టీడీపీకి కొత్త సువర్ణ అధ్యాయం ప్రారంభమైందన్నారు. ఈనెల 10 నుండి నియోజకవర్గంలో గ్రామ గ్రామాన ప్రచారాన్ని ప్రారంభిస్తామన్నారు. మళ్ళీ చంద్రబాబు నాయుడు నాయకత్వం కావాలని ప్రజలు అందరూ ఎదురు చూస్తున్న సమయం వచ్చిందన్నారు. భీమిలి కూటమి అభ్యర్థిగా తనను ప్రకటించిన తర్వాత ఆనంద పురం, పద్మ నాభం, భీమిలి మండలాలు నుండి అనూహ్య స్పందన వస్తుందన్నారు. ఆనందపురం నాకు కలిసి వచ్చే మండలం అని, ఈ రోజు ముగ్గురు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, సుమారు 200 మంది జాయిన్ అయ్యారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని, పరిశ్రమలు రాలేదని, అప్పులు చేసి సంక్షేమం పేరుతో కోట్లాది రూపాయల నిధులను దోచిపెట్టరన్నారు. పింఛన్ల పంపిణీపై సీఎం జగన్ శవ రాజకీయం చేస్తున్నారని, ఈ విషయంలో తెలుగుదేశం పార్టీపై జగన్, వైసీపీ నేతలు నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్ డబ్బులను జగన్ తొత్తులకు, కాంట్రాక్టులకు ఇవ్వడంతోనే ఇబ్బందులు వచ్చాయని అన్నారు. అవ్వా తాతల ఉసురు జగన్‌కి కచ్చితంగా తగులుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 4 వేల పెన్షన్ ఇంటింటికీ వెళ్లి ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల పట్ల విద్యార్థులు మొగ్గు చూపాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరగాలని, ఆయా కార్యక్రమాలకి విద్యార్థులు ముందుకు రావాలని అలా వారిని తయారు చేయడమే జాతీయ సేవా లక్ష్యం అని ఆంధ్ర విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య, జేమ్స్ స్టీఫెన్ అన్నారు. జాతీయ సేవా పథక సెమినార్ హాలులో రాజీవ్ గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ పాలసీ, నా పెరుంబు దూర్ ఆంధ్రవిశ్వ విద్యాలయ జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ జిల్లా లోని ప్రోగ్రాం అధికారులకు "యువజన హక్కులు మరియు న్యాయ సహాయం " అనే అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమ ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.

సేవ కార్యక్రమాల నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, సమాచార మాధ్యమాల్లో వాటికి విస్తృత ప్రచారాన్ని ఇవ్వాలని అన్నారు. సమావేశంలో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యా లయం మాజీ వైస్- ఛాన్సలర్ ఆచార్య వై.సత్యనారాయణ, ఏయు న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య విజయ లక్ష్మి, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి గొట్టిపల్లి టీడీపీ ఎంపీటీసీ

విశాలాంధ్ర - ఆనంద పురం: ఆనందపురం మం డలం గొట్టిపల్లి పంచాయతీ ఎంపీటీసీ దొంతల కనక రాజు ఆయన అనుచరులు అవంతి శ్రీనివాసరావు సమక్షంలో వైసిపి పార్టీ తీర్థం గురువారం పుచ్చుకున్నారు. దొంతల కనకరాజు మాట్లాడుతూ చి స్థానిక ఎన్నికల్లో టిడిపి ఎంపీటీసీగా పోటీ చేయడం జరిగిందని, ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో భీమిలిలో గంటా శ్రీనివాసరావు టిడిపి తరుపున పోటీ చేస్తుండంతో ఆయన నియోజకవర్గంలో ప్రజలకు గాని సమస్యలు పరిష్కారానికి గాని ఏనాడు మొఖం చూపే దాఖలాలు లేని పరిస్థితి ఉందన్నారు. అంతేకాక ఆయన పాలన అంతా కబ్జాల మయం అని, ఆయన పాలనలో టిడిపి నాయకులు కార్యకర్తలు మాత్రమే బాగుపడతారని, ప్రజలు బ్రతుకులు చితికిపోయే పరిస్థితి నెలకొంటుందన్నారు. అటువంటి నాయకుడుతో నడవడం ఇష్టం లేక వైసీపీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండలం వైసిపి పార్టీ అధ్యక్షులు బంక సత్యం, మణి శంకర్ నాయుడు, మజ్జి వెంకట్రావు, గండి గుండం శ్రీను, పాండ్రంగి శ్రీను, గంటా జగదీశ్వర్రావు, గంటా రాజు, గంటా అప్పలరాజు పిన్నింటి రమణ, తాడివాడ అప్పలస్వామి, బంటుబల్లి బంగారు నాయుడు, బంటుబల్లి సూరప్పుడు, కోరాడ శ్రీను, తాడివాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజులు ఐఓటీదే

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ టెక్నాలజీ రంగంలో

అభివృద్ధి మన జీవితాన్ని చాలా సులభతరం చేస్తోందని బెహరా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డా. బెహరా చైతన్య అన్నారు. నరవ బెహరా విద్యా సంస్థల్లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఓ.టి)పై ప్రోజెక్స్ సంస్థ అధ్వర్యంలో సుమారు 120 మంది విద్యార్థులకు మూడు రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ టెక్నాలజీ మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం కానుందని ఇందుకు సంబంధించి ఎన్నో పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతున్నాయని అన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వచ్చిన తర్వాత మన జీవన విధానంలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఒక కొత్త రకమైన టెక్నాలజీ అని అన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనేది టెక్నాలజీ దేవలప్మెంట్ అని దీనిలో నెట్‌వర్కింగ్ ద్వారా ఎన్నో పరికరాలు కనెక్ట్ చేయవచ్చుని దీని ద్వారా అన్ని గాడ్జెట్‌లు ఒకదానితో ఒకటి అనుసందానం అవుతాయని డేటా కూడా ఒకదానితో ఒకటి మార్పిడి చేసుకుంటాయని అన్నారు. ఐఓటీ రాకతో భవిష్యత్తులో స్మార్ట్ హెూమ్‌లు వస్తాయని అన్నారు. ఈ వర్క్ షాప్‌లో ప్రతిభ కన బరిచిన విద్యార్థులకు డా. చైతన్య ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రోజెక్స్ ప్రతినిధి పవన్ కుమార్, ప్రినిపల్ శ్రీధర్ పట్నాయక్, సుకన్య, అద్యాకులు కీర్తి, వంశీ కృష్ణ, మాధురి పాల్గొన్నారు.

శామ్‌సంగ్ బెస్పోక్ గృహోపకరణాల లైనప్ పరిచయం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: శామ్‌సంగ్, భారతదేశంలోని ప్రముఖ వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, ఏఐ సాంకేతికతతో నడిచే దాని బెస్పోక్ ఉపకరణాలను ఆవిష్కరించింది, కనెక్ట్ చేయబడిన పర్యావరణ అనుకూల గృహాల రంగంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. ఈ ఏఐ ఆధారిత గృహోపకరణాల ద్వారా, శామ్సంగ్ వేగంగా విస్తరిస్తున్న ప్రీమియం ఉపకరణాల విభాగంలో కస్టమర్ అంచనాలను అధిగమించ దానికి ప్రయత్నిస్తుంది. అంతర్నిర్మిత వైఫై అంతర్గత కెమెరాలు అధునాతన ఏఐ చిప్‌లతో అమర్చబడి, బెస్పోక్ ఏఐని కలిగి ఉన్న శామ్ముసంగ్ యొక్క సరికొత్త ఉపకరణాలు అప్రయత్నంగా కనెక్ట్ అయ్యి అనుకూలమైన గృహ నిర్వహణను అందిస్తాయి. వినియోగదారులు తమ దైనందిన జీవితంలో సజావు ఏకీకరణ కోసం స్మార్ట్ థింగ్స్ అప్లికేషన్ ద్వారా నియంత్రణలను సులభంగా యాక్సెస్ చేయవచ్చు.

రూ.10,999లకే రియల్‌మీ ఎంట్రీ-లెవల్ కిల్లర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: రియల్‌మీ ఎంట్రీ-లెవల్ కిల్లర్‌ను కేవలం రూ.10,999లకే ఆవిష్కరించింది. 45 వాట్ల సూపర్ వి ఓ ఓ సి ఛార్జర్‌తో 5000 ఎంఏహెచ్ బ్యాటరీతో ఉన్న పెద్ద విభాగం. ఇది మీడియా టెక్ డిమెన్సిటీ 6100 + 5 జి చిప్ సెట్ విభాగంలో మొదటి వేపర్ ఛాంబర్ కూలింగ్ సిస్టమ్‌ను కలిగి ఉంది. ఇది ఎయిర్ గెస్చర్ ఫీచర్‌ను ఈ విభాగంలో పరిచయం చేస్తుంది. ఈ విభాగంలో 120హెచ్‌జెడ్‌ల అత్యధిక రిఫ్రెష్ రెట్‌ను, మెరుగైన డిస్‌ప్లేను అందిస్తుంది. ఇవి రియల్ మీ డాట్ కాం, ఫ్లిప్కార్ట్‌లో అందుబాటులో ఉంటుంది. కొనుగోలు ధరలో కొనాలి అనుకునేవారు అమ్మకం జరిగే సమయంలో 1000 రూపాయల క్యాష్ బ్యాక్‌కి అన్నీ ముఖ్య ట్రీమ్స్‌లో పొందవచ్చు.

53 వేల యూనిట్ల అత్యధిక రిజిస్ట్రేషన్లను నమోదు చేసిన ఓలా ఎలక్ట్రిక్

విశాలాంధ్ర - విశాఖపట్నం: మార్చి నెలలో 53,000 రిజిస్ట్రేషన్‌లను (వాహన్ పోర్టల్ ప్రకారం) నమోదు చేసినట్లు ఓలా ఎలక్ట్రిక్ సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. దీంతో ఓలా ఎలక్ట్రిక్ వరుసగా ఐదవ నెలలో కూడా అత్యధిక నెలవారీ రిజిస్ట్రేషన్‌లను నమోదు చేసుకోవడంతో పాటు మార్కెట్ వాటాలో తమ ప్రథమ స్థానాన్ని కొనసాగించిందన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో 1,52,741 యూనిట్ల నుండి 2024 ఆర్థిక సంవత్సరంలో 328,785 యూనిట్లతో కంపెనీ 115 శాతం వృద్ధిని సాధించిందన్నారు. గత త్రైమాసికంలో 84,133 యూనిట్ల తో పోలిస్తే %ు4 ఫీ%24లో 119,310 యూనిట్లతో త్రైమాసికం ప్రాతిపదికన 42 శాతం వృద్ధి నమోదు చేసుకుందని ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అన్షుల్ ఖండేల్వాల్ పేర్కొన్నారు. కంపెనీ తన సేవా నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా విస్తరించే ప్రయత్నంలో భాగంగా మార్చి 19న ప్రయాగ్‌రాజ్‌లో తన 450వ సేవా కేంద్రాన్ని కూడా ప్రారంభించిందని వివరించారు.

7న జీ తెలుగులో ఫ్యామిలీ స్టార్‌తో ఉగాది సందడి

విశాలాంధ్ర - విశాఖపట్నం: జీ తెలుగు ఈ ఉగాదికి మరో అదిరి పోయే కార్యక్రమంతో వచ్చేస్తోంది. టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండగ ఉత్సవం ఫ్యామిలీ స్టార్‌తో ఉగాది ఉమ్మడి కుటుంబం ఈ నెల 7వ తేదీనసాయంత్రం 6 గంటలకు, మీజీ తెలుగులో ప్రసారమవుతున్న దని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరాది ఉగాది పండగని జీ తెలుగు నటీనటులందరూ ఘనంగా జరుపుకున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. జీ తెలుగు తారలతో కలిసి విజయ్ చేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. ఇక డ్రామా జూనియర్స్ పిల్లలు విజయ్ దేవరకొండకోసం ప్రత్యేకంగా చేసిన స్కిట్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుందనన్నారు.

హాయర్ నుంచి హెవీ డ్యూటీ రేంజ్ ఎయిర్ కండీషనర్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: హయర్ ఇండియా ఈ వేసవి కోసం సరికొత్త ఉత్పత్తులతో సిద్ధమైంది. అందులో భాగంగానే సూపర్ హెవీ-డ్యూటీ ఎయిర్ కండీషనర్‌లను విడుదల చేసింది. హెక్సా ఇన్వర్టర్ సూపర్‌సోనిక్ కూలింగ్ టెక్నాలజీని కలిగి ఉన్న కొత్త ఎయిర్ కండీషనర్లు... 20 రెట్ల వేగవంతమైన కూలింగ్ ను అందిస్తాయి. అంతేకాకుండా దాదాపు 65 శాతం శక్తిని కూడా ఆదా చేస్తాయి. హయిర్ ఇండియా హెక్సా ఇన్వర్టర్ టెక్నాలజీ, కేవలం 10 సెకన్లలో సూపర్‌సోనిక్ కూలింగ్, ఫ్రాస్ట్ సెల్ఫ్-క్లీన్ టెక్నాలజీ మరియు ఇంటెల్లి కన్వర్టిబుల్ 7-ఇన్-1 వంటి అధునాతన ఫీచర్ లను కలిగి ఉన్న ఉత్పత్తులను అందిస్తూ సరికొత్త ప్రమాణాలను సెట్ చేస్తుంది.

కేజీహెచ్‌లో చిన్నపిల్లల వార్డు పునః ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్థానిక కింగ్ జార్జి ఆసుపత్రిలో ఆధునికీకరణ పనులు పూర్తయిన చిన్నపిల్లల ఐసీయూ వార్డును ఎన్నికల నియమావళి అనుసరించి జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున గురువారం పునఃప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో 80 లక్షల నిధులతో చిన్నపిల్లల విభాగంలో పూర్తి స్థాయి వెంటిలేటర్లు, ఏసీ, అధునాతన ఉపకరణాలు సమకూర్చి పలు సదుపాయాలతో కార్పొరేట్ ఆసుపత్రి రీతిలో ఆధుని కీకరణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్, ఏఎంసీ ప్రిన్సిపల్, చిన్నపిల్లల వార్డు విభాగాధిపతులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.